# కృష్ణస్వప్నం

అది అమెరికా అధ్యక్షుని పడక గది.

రాత్రి మూడు గంటల సమయం.

అతను ఎనభై సంవత్సరాల వృద్ధుడు. గాఢ నిద్ర కోసం అతను మాత్ర మింగాడు. దాని ప్రభావం అంతంత మాత్రంగానే వుంది.

గదంతా ఒక్కసారిగా వెలుతురు నిండింది. చల్లటి గాలి వీయసాగింది.

కళ్ళు విప్పాడు అధ్యక్షుడు.

ఆ వెలుతురంతా ఒక ఆకారం అయింది.

ఆ చల్లదనమంతా ఒక మందహాసం అయింది.

ఆ ఆకారం శిరసుపై నెమలిపింఛం; శరీరంపై పీతాంబరాలు, చేతిలో మురళి, గుండెలపై కౌస్తుభం, మెడలో వైజయంతిమాల, ముక్కు కొసన నవమౌక్తికం...

అధ్యక్షునికి భయంతో నాలుక పొడారిపోయింది. నోరు పెగలలేదు.

కాని, ఆ మందహాసం అతని హృదయాన్ని తాకింది.

ఎనభై ఏళ్ళ వయసు దాటికి - ఎన్ని మందులు కాపలా పెట్టినా - లొంగిపోయింది శరీరం. సుఖదుఃఖానుభూతులకు సరిగ్గా స్పందించటం లేదు హృదయం. సక్రమమైన ఆలోచనలకు సహకరించటం లేదు మేధస్సు.

ఆ మందహాసంలో ఏదో తెలీని ఆత్మీయతాభావన... ఏదో అభినందన...

స్పందించిన హృదయం అందించిన ధైర్యంతో... మేధస్సునీ, శరీరాన్ని స్వాధీనం చేసుకుంటూ అధ్యక్షుడు ప్రశ్నించాడు.

"ఎవరు నీవు..?"

"కృష్ణుడను...?"

"అంటే..."

"రేపు కలవబోయే భారత ప్రధానితో మాటలాడటం కోసం... నువ్వు చూస్తున్న గీత... ప్రవక్తను–"

"అట్లాగా! ఎట్లా వచ్చావు యీ గదికి?"

"సర్వాంతర్యామిని...?"

"ఎందుకు వచ్చావు స్వామీ!"

"అభినందించాలని..."

"ఏం చేసానని?"

"నా స్వప్నాన్ని సాకారం చేసావు..."

"ఏమిటి నీ స్వప్నం?"

"నాది నాగరికతా స్వప్నం – నాది నాగరికుల స్వప్నం – యుగయుగాల స్వప్నం – నేతల స్వప్నం – విజేతల స్వప్నం–"

"అంతటి స్వప్నాన్ని సాకారం చేసానా!!!"

"అవును–"

"అదేమిటో వివరించు స్వామీ–"

మెల్లగా నవ్వాడు కృష్ణుడు. మెచ్చుకోలుగా నవ్వాడు కృష్ణుడు. మేధస్సును జాగృతం చేయజూస్తూ నవ్వాడు.

"నువ్విప్పుడు ప్రపంచంలో ఏకైక విజేతవు కదూ–"

"అవును– ప్రపంచంలో విజేత ఎప్పుడూ ఒక్కడే–"

"ఇరాక్ మీద గెలిచావు కదా–"

"అదెంతపని స్వామీ– మా వాళ్ళు ఆడుతూ పాడుతూ విమానాలలో షికారు వెళ్ళి మీటలు నొక్కి బాంబుల వాన కురిపించి, తారెత్తించేసారు–"

"నువ్వెప్పుడయినా యుద్ధ రంగంలోకాలుపెట్టావా?"

"లేదు–"

"నీ మీదకు ఎవరయినా వస్తే కుస్తీ పట్టగలవా?"

"పట్టలేను–"

"నిన్ను నీవు కాపాడుకోగలవా?"

"నన్ను రక్షించటానికి ఎంత బలముందో... బలగముందో... నీకు తెలియదు... నాకు

ఆ అవసరం లేదు-"

కృష్ణుడు అవునన్నట్లు తలూపాడు.

"మా కాలంలో మాకు ఆ అవసరం ఉండేది. మమ్మల్ని మేం కాపాడుకోటానికీ, ఇతరులను జయించటానికీ మాకు శారీరక బలం అవసరమయేది. మమ్మల్ని మేం ఆయుత్తం చేసుకోటానికి వేదాంతం, సిద్ధాంతం మేమే తయారు చేసుకోవలసి వచ్చేది-"

"అర్థం కాలేదు స్వామీ-"

❖ ❖ ❖

"చూస్తున్నావా - దాన్ని ఖాండవవనం అంటారు-"

"ఎత్తైన చెట్లతో, దట్టమయిన పొదలతో, పక్షుల కిలకిలా రావాలతో, జంతువుల స్వేచ్ఛా విహారాలతో, సెలయేళ్ళతో, ఎంత చక్కని ప్రదేశం! అదేమిటి? ఎవరో... కొండజాతి వాళ్లలా ఉన్నారు... పెద్ద పెద్ద పుట్టల నించి పాకుతూ బయటికి వస్తున్నారు-"

"వాళ్ళు నాగులు... నాగజాతి వాళ్ళు- ఎప్పటి నుంచో ఆ వనాన్ని ఆక్రమించుకుని బ్రతుకుతున్నవాళ్ళు..."

"అంటే.. అబారిజన్సా?"

"అంటే?"

"నాగరికతలో వెనుకబడిన వాళ్ళు- ఒక ప్రాంతానికి ఎప్పుడు వచ్చారో... ఎలా వచ్చారో... అక్కడే ఎలా పుట్టారో... రికార్డులు లేనివాళ్ళను మేం అబారిజన్స్ అంటుంటాం"

కృష్ణుడు నవ్వాడు- "మీరు మరీ నాగరికులు గదా- మర్యాద అయిన పేర్లు వాడతారు. అది ఒక విధమైన విభజన - పైకి చెప్పే విభజన - అసలు విభజన ఏంటంటే ఆయుధాలు. ఎంత దూరంగా ఉండి నువ్వు శత్రువును కొట్టగలిగితే... అందుకు తగిన ఆయుధాన్ని కనిపెట్టగలిగితే... చేపట్టగలిగితే... తరిమికొట్టగలిగితే నువ్వు అంతటి నాగరికుడివి. నీ ఆయుధమే నాగరికత. అది నీ చేతుల్లో ఉంటే నువ్వు ఎదుటివాళ్ళ నాగరికతకు కొలబద్ద పవుతావు. నువ్వు వాళ్ళని అనాగరికులు అనొచ్చు - నరరూప రాక్షసులు అనొచ్చు - నరమాంస భక్షకులు అనొచ్చు. కోతులు అనొచ్చు - ఎలుగుబంట్లు అనొచ్చు - గెద్దలు అనొచ్చు - పాములు అనొచ్చు - వాళ్ళని వాళ్ళ స్థలం నుంచి తరిమికొట్టవచ్చు - వాళ్ళ స్థానంలో ఉండవచ్చు - అదీ అసలు విభజన-"

"నువ్వు చాలా గొప్ప సిద్ధాంతవేత్తవు స్వామీ-"

"అలా చూడు... ఆ వనంలో ఏం జరుగుతోందో-"

❖ ❖ ❖

వనమంతా అల్లకల్లోలమయిపోయింది. పక్షులు, జంతువులు తరుముతున్న మంటలను తప్పించుకోటానికి ప్రయత్నం చేస్తున్నాయి.

రాళ్ళూ, రప్పలతో ప్రతిఘటించారు నాగులు.

దూసుకువస్తున్న బాణాల ముందు నిలువలేక కకావికలయిపోతున్నారు నాగ స్త్రీలూ, పురుషులూ.

చెట్టు దులిపిన కాయలయిపోతున్నారు.

మహోత్సాహంతో నరికివేత సాగిస్తున్నారు మహావీరులు.

దహనం నిరాటంకంగా కొనసాగుతోంది. మంటలు లేస్తున్నాయి. వాటిమీంచి వీస్తున్న గాలులు ఆ మహావీరుల శరీరాలను మండిస్తున్నాయి. పొగలో వారి ముక్కూ కళ్ళూ ఏకమవుతున్నాయి. కాలుతున్న కమురు కంపు కడుపును తిప్పేస్తోంది.

వనం అంచున ఓ రాతిబండ మీద కూర్చున్నాడు అర్జునుడు.

నరికి, నరికి అతని రెండు బాహువులూ అలసిపోయాయి. కాళ్ళు కదలనంటున్నాయి. అలసిన శరీరం విశ్రాంతి కోరుతోంది. అన్నింటికన్న ముఖ్యంగా దాహంగా ఉంది.

కృష్ణుని పరిస్థితీ అలాగే వుంది.

"మంచినీళ్ళు తాగాలి - బావా!"

"పద!"

ఇద్దరూ సెలయేటిలోకి నడిచారు. గంతులు వేస్తున్నట్లు రాళ్ళ మీంచి పరుగెత్తుతోంది నీరు. ఆత్రంగా నీటిలోకి చేతులు పెట్టి నీరు తీసుకోబోయేడు. కొట్టుక వస్తున్న ఏదో మానవ హస్తం దోసిలికి తగిలింది.

జలదరింపుతో చేతులు విదిలించుకున్నాడు అర్జునుడు.

నీటివయిపు తేరిపార చూసాడు.

నీటిలో కొట్టుకుపోతున్న శవాలలో... శవ ఖండాలలో... కొన్ని ఆ సెలయేటి రాళ్ళ సందుల్లో ఇరుక్కున్నాయి.

"లాభంలేదు కృష్ణా - ఈ నీరు పానయోగ్యం కాదు"- అన్నాడు.

కృష్ణుడూ అర్జునుడూ ఒకరి మొహాలు ఒకరు చూసుకున్నారు.

"కాస్త ఎగువకు పోదాం-" అన్నాడు కృష్ణుడు.

"ఇదే నీరుగదా-" అన్నాడు అర్జునుడు.

కృష్ణుడు కాలుతున్న వనం వయిపు చూసాడు. కనుచూపు మేరలో ఎక్కడయినా తేనెతుట్టె కనిపిస్తుందేమోనని గమనించాడు. సాయంకాలపు నీరెండ ఆ ప్రదేశమంతా పడుతోంది.

పచ్చదనమంతా ఆ ప్రదేశం నుంచి మాయమయింది. భయంకరమైన నిశ్శబ్దం. నిప్పు అంటుకొంటున్న కొమ్మలు, ఫెటిల్లుమంటున్న శబ్దాలు మధ్య మధ్యలో. ఎక్కడా ప్రాణుల అలికిడి వినపడటం లేదు.

"ఇంచుమించు మన పని పూర్తయినట్లే - పోదాం" అన్నాడు కృష్ణుడు.

"మళ్ళీ రావాలా?"

"వనం పూర్తిగా దగ్ధమయ్యాక - మనం మనవాళ్ళను తేవాలి. దీన్ని వాసయోగ్యం చెయ్యాలి గదా - ఇంద్రప్రస్థం నిర్మించాలి గదా-" అన్నాడు కృష్ణుడు.

అర్జునుడు ఉలిక్కిపడ్డాడు.

కాళ్ళకు చుట్టుకున్నదేమిటో చూడటానికి అసంకల్పితంగా చూపు కదిలింది. అంతే వేగంతో చేతిలోని కత్తి కదిలింది.

అది ఒక మానవ శిశువు.

పాలబుగ్గలు వేలాడుతున్నాయి. శరీరమంతా మట్టిగొట్టుకుని వుంది. పచ్చటి పసిమి వర్ణం. నుదురు పెద్దదిగా, ముక్కు తప్పడగా, కళ్ళు చిన్నవిగా వున్నాయి. ఏడాది వయసుం టుంది. ఆ బిడ్డడు ఆ మహావీరుని పాదాల మధ్య చేరి చిట్టిచేతులతో చుట్టుకుంటున్నాడు.

అర్జునుడు నిలువెల్లా కరిగిపోయాడు.

ఆ బిడ్డ పచ్చటివాడు. తను గోధుమ వర్ణం. కాని తమ మధ్య ఏదో సంబంధం వుంది. ఆ బిడ్డ చల్లటి మట్టి చేతులు - జరుగుతున్న దాన్ని గుర్తించలేని పసినవ్వు - అతన్ని అసంకల్పితంగా ఆహ్వానిస్తున్నాయి.

కదులుతున్న అర్జునుడి భుజం మీద చరిచాడు కృష్ణుడు.

"వేసెయ్ - అర్జునా-" శాంత గంభీరంగా అన్నాడు. అతని స్వరం మానవజాతిలోని ఒక భాగం పట్ల, ఒక ముక్క పట్ల నిబద్ధతతో నిండి వుంది. అతని వదనం కర్తవ్య స్ఫోరకంగా, స్వధర్మ నిర్దేశకంగా వుంది.

"కృష్ణా-" కర్తవ్య విమూఢునిలా తలపంకించాడు అర్జునుడు.

"వెర్రివాడా - శరీర నిర్మాణాన్ని బట్టి నువ్వూ వాడూ ఒకటవుతారా? పుట్టి, పెరిగి, నశించటాన్ని ఆధారం చేసుకుని నువ్వూ, పులీ ఒకటే అనుకుంటావా? దాన్ని నువ్వు సంహరించకపోతే అది నిన్ను భోంచెయ్యదా?"

అర్జునుడు కత్తిని దించలేదు. అతని లోపలికి కృష్ణుడు చొప్పించజూస్తున్న ఆలోచనలు లోపలనున్న దేన్నో బయటకు తరమలేకపోతున్నాయి.

"మైదానాల వాళ్ళం మనం - వనాలనూ, వన్యజీవులనూ తొలగించినట్లే - యిట్లాంటి

అడవి జాతులను సంహరించకపోతే - మనమెలా విస్తరిస్తాం? ఎలా జీవిస్తాం చెప్పు?" అన్నాడు కృష్ణుడు.

అయినా అర్జునుడు కత్తిని దించలేదు.

"మీరూ, మేమూ, కౌరవులూ... ఇత్యాది మనమంతా ఒకటి. సమానులమైన మనం కలియాలన్నా, కలబడాలన్నా... పాటించవలసిన రణనీతి వీరు. వీళ్ళు వేరు. నీవీ విషయాన్ని నీ అనుచరులకూ, సైనికులకూ నూరిపోయకపోతే - వారికి పరజాతుల స్త్రీలను ఇచ్చాను సారం అనుభవించే హక్కుని ఇవ్వకపోతే, వారి ధనాలను కొల్లగొట్టే హక్కుని అంగీకరించక పోతే - నువ్వు సైన్యాలను నిర్మించలేవు. వారిని కట్టడిలో వుంచలేవు. నీ మీద తిరగబడ కుండా వారిని పెంచలేవు.

అయితే - అర్జునా! ప్రాణి సహజాతం స్వరక్షణేగాని పరపీడన కాదు గదా! ఈ సహజాతాన్ని జాగ్రత్తగా వినియోగించుకోవాలి. జాతి అనే పేరుని కల్పించాలి. మీరంతా ఒక జాతి - అని చెప్పి నమ్మించాలి. ఆ జాతి రక్షణే మీ రక్షణ, మీ కర్తవ్యం అని ప్రబోధించాలి. అప్పుడు వారు నిన్నూ, నన్నూ తమ రక్షకుడిగా భావించుతారు. నేతగా స్వీకరించుతారు. తదితర జాతులనూ, వాటి నేతలనూ ఓడించాలి - అవసరమయితే సమూలంగా నిర్మూలించాలి - అప్పుడే మనం విజేతలమవుతాం! అలా విజేతలవటం కోసం మనం మన అనుయాయులకు పరపీడనలో మత్తుని ఎక్కించాలి. సమస్త మానవాళినీ ఒక జాతిగా భావించే తెలివి అందరికీ వచ్చేవరకూ - పరపీడన సాగుతూనే వుంటుంది. మనబోటి వాళ్ళు నేతలూ, ఆ తర్వాత విజేతలూ అయే పథకాలూ కొనసాగుతూనే వుంటాయి" అంటున్నాడు కృష్ణుడు.

అర్జునుడు కత్తిని దూరంగా విసిరేసాడు- "ఆ పసిబిడ్డను చంపలేను - నా శరణు కోరిన బిడ్డను చంపలేను-" అన్నాడు.

కృష్ణుడు నవ్వి - "వెర్రివాడా - నోరులేని ఆ ప్రాణి నిన్ను శరణుకోరటమేంటి? కోరటాని కయినా - వారు నీకన్న అధికులయిన దేవతలైనా కావాలి - నీతో సమానులయిన క్షత్రియులయినా కావాలి. నీ జాతికి శత్రువులయిన ఈ కొండనాగులు కోరటమేమిటి - యోచించు-" అన్నాడు.

కాళ్ళకి చుట్టుకున్న బిడ్డడిని విడిలించుకుని, అక్కడ నుంచి కదిలాడు అర్జునుడు.

కృష్ణుడు స్వధర్మం నెరవేర్చాడు.

రక్తపంకిలమయిన కత్తిని శుభ్రం చేసుకుని వచ్చాడు.

అర్జునుడు ఒక రాతి బండమీద కూర్చుని వున్నాడు.

"ఏమిటయ్యా - అంత తీవ్రమయిన ఆలోచన?" ప్రశ్నించాడు కృష్ణుడు.

"హంసతూలికా తల్పాలపై... పరిచారకుల సేవలందుకుంటూ జీవించే మనం... ఈ మంటల వేడిలో, పొగలో, వాసనలో... ఇలా అలసట పడవలసిందేనా? ఇది మంచి, ఇది చెడ్డ – ఇది ధర్మం, ఇది అధర్మం – అని ఆలోచించే బుద్ధీ, స్పందించే హృదయమూ మనని కృంగదీస్తూంటే – ఈ సంహారకాండను స్వయంగా సాగించవలసిందేనా? కృష్ణా – దీనికి తరుణోపాయం లేదా?" వేదనతో ప్రశ్నించాడు అర్జునుడు.

"మంచి ప్రశ్న వేసావు–" సాలోచనగా అంటూ, మెచ్చుకోలుగా అతని భుజం తట్టాడు కృష్ణుడు.

"నరికేవాడొకడు, నరికించేవాడొకడు, నరికేవాడి చేతిలో కత్తి నరికించేవాడి మాటలో బుద్ధి. అర్జునా! – 'నువ్వు నరకటం లేదు–' అని నరికేవాడిని నమ్మించటమే నరికించేవాడి పని. అందుకోసం సిద్ధాంతాలు చెయ్యటమే వాని మార్గం. ఈ యుగంలో ఇద్దరూ కత్తి పట్టక తప్పదు. కలిసి, కదనరంగంలో కాలుపెట్టక తప్పదు. నిజంగా ఇది మన దురదృష్టమే – ఏం చేస్తాం – ఇది ఈ యుగ ధర్మం."

అర్జునుడు కృష్ణుడి చూపుల్లో ఏదో వెతుక్కుంటూ అడిగాడు– "మరో యుగంలో ఈ దురవస్థ పోతుందా – స్వామీ?"

"నిస్సందేహంగా పోతుంది–" అన్నాడు కృష్ణుడు.

'ఇకపైన నేను ఆయుధం పట్టకుండా నీ చేతనే పట్టిస్తాను'– అనుకున్నాడు కృష్ణుడు.

అర్జునుడు నమ్మలేనట్టుగా చూసాడు.

"యుద్ధాల్లోకే అడుగుపెట్టకుండా – యుద్ధ విజేతలయే యుగం తప్పక వస్తుంది" అన్నాడు గంభీరంగా కృష్ణుడు.

"నీది స్వప్నం–"

"ఇది ఈనాడు స్వప్నం – భవిష్యత్తులో సత్యం."

❖ ❖ ❖

"నువ్వు దాన్ని సత్యం చేసావు నా వారసుడా–" అంటూ కృష్ణుడు ఆశీర్వదిస్తూ క్రమంగా చీకటిలో కరిగిపోయాడు.

ప్రపంచ చరిత్రలో ఒకరినొకరు సంహరించుకోటానికి వేలాది మందిని ప్రేరేపించే అలెగ్జాండర్, చంఘీజ్‌ఖాన్, తామర్లేన్, హిట్లర్ వంటి వారి ఉపన్యాసాలు అమెరికా అధ్యక్షుని చెవులలో పడసాగాయి.

ఏవేవో ప్రాచీన స్మృతుల అందీ అందని ప్రకంపనాలు... ఎన్నో, ఎన్నెన్నో వేల ఆర్త నాదాల నడుమ కొద్దిమంది నిర్లిప్త, నిశ్శబ్ద విజయహాసాలు... రాళ్ళు, కర్రలు, కత్తులు,

బాణాలు, తుపాకులు, ఫిరంగులు, బాంబులు, టాంకులు, యుద్ధ విమానాలు, క్షిపణులు, ఒకదాని నుంచి ఒకటి పుట్టుకొస్తూ... ఒకదానిని ఒకటి నెట్టివేస్తూ... మనిషిని మనుషుల నుండి వేరుచేస్తూ... మనిషిని మనిషి మూపుపై సవారి చేయిస్తూ... మనుషుల మూపులపై మాత్రం అధివసించ గలవారల పరస్పరాభినందనోత్సవాల కోలాహలం...

అధ్యక్షుని కళ్ళ ముందు దృశ్యాలు. చెవులలో శబ్దాలు.

అది అలా ఎంతసేపు సాగేదోగాని... వాస్తవ శరీర బాధ అతనిని తట్టింది. లేవక తప్ప లేదు. బలహీనమయిన వృద్ధ హస్తాలతో... నానా అవస్థా పడుతూ... మంచినీళ్ళ గ్లాసుని అందుకుని నోరు తడుపుకున్నాడు.

సమయం వయిపు చూసాడు. ఉదయం ఆరు గంటలవబోతోంది.

మంచం మీద నుంచి లేచాడు. అటూ ఇటూ పచార్లు చేసాడు. తల అటూ యిటూ పంకించాడు. పిడికిళ్ళు బిగించాడు. చేతులతో కడుపు మీద రాసుకున్నాడు.

చదవటానికి ఏమయినా దొరుకుతుందా అని తన పని బల్ల మీద వెదికాడు. ఇతర దేశాలలో మానవ హక్కుల మీదా, ప్రజాస్వామ్యం మీదా, కార్మిక జీవన ప్రమాణాల మీదా... అతను ఆరోజు యియ్యవలసిన ఉపన్యాసాల కోసం... ఆయా రంగాలలో నిష్ణాతులు తయారుచేసిన పేపర్లు... ఆ బల్లమీద వున్నాయి.

వాటిని తీసుకుని అతను టాయ్‌లెట్‌లోకి నడిచాడు.

అవి చదువుతూంటే... అతనికి నవ్వు రాసాగింది.

ఆ నవ్వు... తెరలు తెరలుగా మొదలై... అలలు అలలుగా సాగి... భువన భవనాలను వదిలి... దేశదేశాలను కలియజుట్టి... ప్రపంచాన్ని నెట్టి... భూగోళాన్ని... విశ్వాంత రాళాన్ని... భీతావహంగా ఆక్రమించుకోసాగింది.

ఆ నవ్వులోంచి ఒక రూపం పుట్టింది.

క్రమంగా ఆ రూపం భూమ్యాకాశాలనూ, దిక్కులను, నక్షత్ర మండలాన్ని కలుపుకొంటూ వ్యాపించింది.

ఆ రూపానికి వేలాది ముఖాలు, లక్షలాది హస్తాలు, కోట్లాది పాదాలు వున్నాయి. ఆ పాదాల క్రింద, చేతులలో, దంతాల నడుమ కోటానుకోట్ల మానవులు నలిగిపోతున్నారు.

నలిగిపోతున్న మానవుల నుంచి రాలుతున్న తేనె బిందువులను లక్షలాది గిన్నెలలో పడుతున్నారు. ఆ గిన్నెలలో తేనెను వారు గంగాళాలలో నింపుతున్నారు. ఆ గంగాళాలలో తేనెను వేలాది మంది మోసుకువెళ్ళి, గొట్టాలతో ఒంపుతున్నారు. ఆ గొట్టాలన్నీ ఆ రూపానికి కలపబడి వున్నాయి.

గిన్నెలలో పడుతున్న వారూ, గంగాళాలలో నింపుతున్నవారూ, గొట్టాలలో ఒంపుతున్న వారూ తమ చేతుల కంటిన తేనెను నాకుతున్నారు. వారలా నాకుతూ వుంటే, దాని మాధుర్యంలో వారు తమ తలలలోని మెదడులను స్వయంగా పెరికి, ఆ మహారూపానికి నైవేద్యం చేస్తున్నారు.

ప్రపంచ దేశాల అధినేతలూ, భౌతికశాస్త్రాల నిపుణులూ; పారభౌతిక విద్యాపారంగతులూ; రాజకీయ, సామాజిక, ఆర్థిక శాస్త్రవేత్తలూ వంటి ప్రపంచ గమన రహస్యాల నెరుగగల స్థానమూ, విద్యాగలవారూ, దాన్ని నడపగలవారూ ఆ రూపం చుట్టూ తిరుగుతూ భజన చేస్తున్నారు. ఆ రూపం పోస్తున్న తేనె కోసం ఎగబడి, మోరలు సాచి నాకుతున్నారు.

ఆ రూపానికి హృదయముండవలసిన చోట ఒక మహారంధ్రం వుంది. దానిలోంచి రకరకాల ఆయుధాలు, ప్రయాణ సాధనాలు, విరామ స్థావరాలు, వినోద సాధనాలు, సమాచార సాధనాలు అటునించి యిటూ, యిటునించి అటూ... ఎగురుతున్నాయి. కాళ్ళూ చేతులూ కదపగల ప్రతి మనిషీ ఎగురుతున్న ఆ వస్తు సంచయం కోసం వెర్రిగా, ఆబగా అరుస్తున్నాడు.

ఆ రూపం క్రమంగా కుంచించుకుపోయి ఒక చిన్ని మాత్రగా మారింది. అది అధ్యక్షుని కడుపులో చేరింది. క్రమంగా పని ఆరంభించింది.

కొంతసేపటికి అధ్యక్షుడి కడుపు కదిలి, విశ్రాంతి లభించింది.

అతను 'అమ్మయ్య!' అనుకున్నాడు.

శరీరాంగాలను స్వాధీనపరచుకుంటూ, భారం తీరిన శరీరంతో ఆ వృద్ధుడు విశాలమైన ఆ టాయ్‌లెట్‌లోంచి ఒంటరిగా బయటపడ్డాడు.

■

(అన్వేషణ వారపత్రిక - 12.12.95)